సాక్షి రంగారెడ్డి

బుధవారం । 10 । జూలై । 2024



హామీల అమలులో విఫలం

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని బీజేపీ కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. 10లో▸



అభివృద్ధికి ప్రాధాన్యత

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 10లో▸



సంరక్షణ ముఖ్యం

మొక్కలు నాటి సంరక్షించాలని అటవీ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ రేంజ్ అధికారి విష్ణువర్ధన్‌రావు అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాలకు ప్రభుత్వం అండ

రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి



రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు భద్రత చెక్కు అందజేస్తున్న కమిషనర్ తరుణ్‌జోషి

ఇబ్రహీంపట్నం రూరల్: పోలీసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి అన్నారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ రాజేందర్‌రెడ్డి డిసెంబర్ 23న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ మేరకు మంగళవారం ఆయన భార్య మమత, కుమారుడు సుజిత్‌కు కమిషనర్ తరుణ్‌జోషి రూ.7,96,745లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హాస్టళ్లలో వసతులు కల్పించండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివ కుమార్ గౌడ్



డీటీడీఓ రాజేశ్వరిదేవికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ సంఘం సభ్యులు

తుర్కయంజాల్: జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీటీడీఓ రాజేశ్వరిదేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కడ్తాల్, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని ఆరోపించారు. మెనూ ప్రకారం భోజనం అందజేయాలని.. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వినతి ప త్రం ఇచ్చిన వారిలో శివ, వివేక్, చరణ్ తదితరులున్నారు.

కల్తీ వైన్ తయారీ.. మహిళ అరెస్టు

ముషీరాబాద్: ఇంట్లో కల్తీ వైన్ తయారు చేసి విక్రయిస్తున్న మహిళను మంగళవారం ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తెలిపిన ప్రకారం.. లాలాగూడ, విజయపురి కాలనీకి చెందిన గెరాల్డింగ్ మిల్స్ గృహిణి. తన ఇంట్లో ద్రాక్ష పండ్లు, చక్కెరతో కల్తీ వైన్ తయారు చేస్తూ వాటిని లీటర్, రెండు లీటర్ల బాటిళ్లలో నింపి విక్రయిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం ఆమె ఇంటిపై దాడి చేసి తనిఖీలు నిర్వహించగా 112 బాటిళ్లలో నింపిన 90 లీటర్ల కల్తీ ద్రాక్ష వైన్‌ను పట్టుకున్నారు. వైన్‌ను నింపడానికి సిద్ధంగా ఉన్న ఖాళీ బాటిల్స్‌ను సైతం సీజ్ చేశారు.

ఫార్మాసిటీ.. క్లారిటీ

నేడు ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో ఫార్మాసిటీ భూ బాధితులతో సమావేశం

- వివరాలు వెల్లడించనున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, కోదండరెడ్డి
- హాజరవనున్న నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద రైతులు
- గెజిట్ రద్దు చేయకపోవడంతో నిలిచిన భూ క్రయ, విక్రయాలు

యాచారం: ఫార్మాసిటీని రద్దు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినా భూ బాధితుల్లో నమ్మకం కుదరడం లేదు. సర్కార్ ఫార్మాసిటీని రద్దు చేస్తే గెజిట్ ప్రకటించిందా.. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారా.. లేదా టౌన్‌షిప్‌లు నిర్మిస్తారా.. అనే విషయమై అధికారికంగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. కేసీఆర్ సర్కార్ హయాంలో జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. గత ప్రభుత్వం రూ.వేలాది కోట్లు ఖర్చు చేసి 10 వేల ఎకరాలకు పైగా భూసేకరణ చేయడంతో పాటు, సేకరించిన భూముల్లో ఫార్మా కంపెనీలకు స్థలాలు అప్పగించడానికి లేవుట్ చేసి 500 ఎకరాల చొప్పున ప్రత్యేక బ్లాక్‌లు చేసి రోడ్లను అభివృద్ధి చేసింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటించింది. అనుకున్న విధంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది రోజుల్లో ఫార్మాసిటీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మూడు వేల ఎకరాల వరకు కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుతో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఫార్మాసిటీని రద్దు విషయంలో స్థానికుడైన ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి, ప్రస్తుత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తీవ్రంగా కృషి చేశారు.

నేటికీ పాత నిబంధనలే..

ఫార్మాసిటీని రద్దు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా నేటికీ అవే నింబంధనలు అమలు చేస్తున్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయించిన భూసేకరణలో 19,333 ఎకరాల్లో సింహభాగం 9,851 ఎకరాలకు పైగా పట్టా, ప్రభుత్వ, అసైన్డ్ భూములను యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోనే సేకరించారు. 7,640 ఎకరాలకు సంబంధిత రైతులకు పరిహారం అందజేశారు. 2,211 ఎకరాలకు సంబంధించిన రైతులు తమ పట్టాభూముల్లో ఏటా మూడు పంటలు పండుతాయని.. తాము ఫార్మాకు భూములివ్వమని తేల్చిచెప్పారు. అయినప్పటికీ టీఎస్ఐఐసీ, రెవెన్యూ అధికారులు రైతుల ఇళ్ల చుట్టూ తిరిగారు. వారు వినకపోవడంతో అధికార యంత్రాంగం ఒత్తిడి పెంచింది. అధికారుల బాధ తట్టుకోలేక రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆగ్రహించిన అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండానే 2,211 ఎకరాలకు గాను 1,966 ఎకరాల పట్టా భూములను అవార్డ్ పాస్ చేసి పరిహారం నగదును అథారిటీలో జమ చేశారు. తదనంతరం ఇందుకు సంబంధించిన క్రయ, విక్రయాలను రద్దు చేశారు.



బీఆర్ఎస్ ప్రభుత్వం నానక్‌నగర్-నక్కర్తమేడిపల్లి గ్రామాల మధ్య చేపట్టిన రోడ్డు పనులు



నక్కర్తమేడిపల్లిలో ఫార్మాసిటీకి సేకరించిన భూమిలో పాతిన టీఎస్ఐఐసీ బోర్డు

అయోమయంపై స్పష్టత

ఫార్మాసిటీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ భూముల్లో తరచూ శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు పర్యటిస్తూ పరిశ్రమలు వద్దు, పంట పొలాలే ముద్దు అంటూ విస్తృతంగా ప్రచారం చేస్తుండడంతో సర్కార్‌కు తలనొప్పులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో రైతుల్లో ఆందోళన పోగొట్టేందుకు టీఎస్ఐఐసీ పేరు మీద నమోదు చేసిన పట్టా భూముల రికార్డులను మళ్లీ రైతుల పేరిట నమోదు చేసేలా, ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో సర్కార్ భవిష్యత్‌లో ఏం చేయబోతుందనే వివరాలను బుధవారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి వెల్లడించనున్నారు. సమావేశానికి హాజరవ్వాలని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులకు ఇప్పటికే సమాచారం ఇచ్చారు.

రద్దు సంతోషమే



కాంగ్రెస్ సర్కార్ ఫార్మాసిటీని రద్దు చేయడం తో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతుంది. అప్పటి బీఆర్ఎస్ సర్కార్ రైతులకు సమాచారం లేకుండానే పట్టా భూములకు సంబంధించి పరిహారాన్ని అథారిటీలో జమ చేసి, రైతుల భూ రికార్డులను టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేసింది. మూడేళ్లు భూ రికార్డుల మార్పునకు పోరాడాం. ప్రస్తుత ప్రభుత్వం భూ రికార్డులను వెంటనే రైతుల పేరిట చేయాలి. బ్యాంకు రుణాలు కూడా పొందలేకపోతున్నాం.

– శ్రీకాంత్ నాయక్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు

సర్కారు నిర్ణయమే



టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేసిన పట్టా భూముల రికార్డులు మళ్లీ రైతుల పేర్ల మీదకు మార్చాలంటే ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. ఫార్మాసిటీని రద్దు చేస్తే ఇది వరకు సేకరించిన భూముల్లో మరేదైనా ప్రాజెక్టు లేదా పరిశ్రమ పెట్టే అవకాశం ఉంటుంది. రైతులకు భూములు తిరిగి ఇచ్చేది కుదరదు. అథారిటీలో పరిహారం డబ్బులు జమ చేసిన విషయం కోర్టు పరిధిలో ఉంది. ప్రభుత్వ వెల్లడించే నిర్ణయాన్నే మేము అమలు చేస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం



'ఇంటింటా ఇన్నోవేటర్' పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

నూతన ఆవిష్కరణలకు 'ఇంటింటా ఇన్నోవేటర్'

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇచ్చే ప్రదర్శనలు కొత్త తరహాలో ఉండేలా చూడాలని కలెక్టర్ శశాంక సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లోనూ ఈ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పరిధిలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు నూతన ఆవిష్కరణలతో తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. ఆసక్తిగల వారు ఆవిష్కరణ పేరు ప్రదర్శనకు సంబంధించి రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు. వంద పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబరు 9100678543కు పంపాలని సూచించారు. పేరు, వయస్సు ఫొటో, వృత్తి, గ్రామం తదితర వివరాలతో ఆగస్టు 3లోగా వాట్సాప్ చేయాలన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్ఓ సంగీత, పీడీ డీఆర్‌డీఏ శ్రీలత, డీపీఓ సురేశ్‌మోహన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ ఇన్నోవేషన్ కోఆర్డినేటర్ కొబ్బన్న వాసు తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన సీఎస్ శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి.. నాటిన ప్రతీ మొక్కకు జియో ట్యాగింగ్ చేపట్టి సంరక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపడుతున్నామని వివరించారు.

అర్ధరాత్రి.. అర్ధనగ్న నృత్యాలు



ముజ్రా పార్టీ నిర్వహిస్తూ పట్టుబడిన రెహాన్ సిద్ధ చౌహాన్ అతని స్నేహితులు

- ఫాంహౌస్‌లో ముజ్రా పార్టీ
- అర్ధనగ్న నృత్యాలతో యువతీయువకుల హంగామా
- సమాచారం అందుకుని దాడి చేసిన ఎస్ఓటీ పోలీసులు
- పది మందికి రిమాండ్

మొయినాబాద్: అర్ధరాత్రి వేళ.. డీజే సౌండ్స్ హోరులో యువతీ, యువకులు అర్ధనగ్న నృత్యాలు చేస్తూ.. నిర్వహిస్తున్న ముజ్రా పార్టీని ఎస్ఓటీ పోలీసులు భగ్నం చేశారు. ఆరుగురు యువకులతో పాటు, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన మొయినాబాద్ మండలం సురంగల్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతానికి చెందిన రెహాన్ సిద్ధ చౌహాన్ ఆటో డ్రైవర్. ఇతని భార్య ఆర్కెస్ట్రా సింగర్. రెహాన్ సిద్ధ చౌహాన్ టోలిచౌకిలో ఉండే మరో ఐదుగురితో కలిసి పార్టీ నిర్వహించేందుకు సురంగల్ దగ్గర్లోని నజీబ్‌నగర్ రెవెన్యూలో ఉన్న ఆర్ఎస్ ఫాంహౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. తన భార్యతో పాటు ఆర్కెస్ట్రా డ్యాన్సర్స్‌గా పనిచేసే ఢిల్లీకి చెందిన ఇద్దరు యువతులు, హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు అమ్మాయిలను తీసుకుని సోమవారం రాత్రి ఫాంహౌస్‌కు చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో డీజే సౌండ్ పెట్టి అర్ధనగ్నంగా, అసభ్యంగా నృత్యాలు చేస్తూ ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు రాత్రి 2 గంటల సమయంలో ఫాంహౌస్‌పై దాడి చేశారు. నలుగురు యువతులు, ఆరుగురు యువకులను అరెస్ట్ చేశారు. వీరు వచ్చిన రెండు కార్లతో పాటు మ్యూజిక్ సిస్టమ్, సెల్‌ఫోన్లు, రూ.18,160 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరికి డ్రగ్స్ టెస్ట్ చేయగా నెగిటివ్ వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు పది మందిని రిమాండ్‌కు తరలించారు.

చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం

చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి దశరథరామయ్య

చేవెళ్ల: విద్యార్థులు చదువుతో పాటుగా హక్కులు, న్యాయ సేవా సంస్థలు, న్యాయ సేవలు, చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి దశరథ రామయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా దశరథ రామయ్య మాట్లాడుతూ.. ర్యాగింగ్ నిరోధక చట్టం విద్యార్థులకు రక్షణగా ఉంటుందని చెప్పారు. అవగాహన లేమితో విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు మీపై ఎంతో నమ్మకం పెట్టుకొని వారు ఎంతో కష్టపడుతూ చదువు చెప్పిస్తున్నారని గుర్తుంచుకోవాలన్నారు. వారి నమ్మకాలను వమ్ము చేస్తూ వ్యసనాలకు అలవాటు పడొద్దని సూచించారు. మహిళల రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉన్నతంగా చదివి ఉత్తములుగా ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్‌రెడ్డి, లీగల్ కౌన్సిల్ కుమార్, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దశరథరామయ్య



అమ్మవారి కల్యాణానికి వస్తున్న జోగిని శ్యామల



ఎల్లమ్మ కల్యాణ ఘట్టం

ఎల్లమ్మ కల్యాణం.. ఎల్లెడలా ఆనందం

తండోపతండాలుగా తరలివచ్చిన భక్తజనం

- బల్కంపేటలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ

అమీర్‌పేట: జయహో ఎల్లమ్మా అంటూ భక్తుల నినాదాలు.. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికతను సంతరించుకుంది. భక్తుల కోర్కెలు తీర్చే బల్కంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. మంగళవారం ఇక్కడి ఆలయంలో నిర్వహించిన పూజల అనంతరం సర్వాంగసుందరంగా తీర్చి దిద్దిన కల్యాణ వేదికపైకి ఉత్సవ మూర్తులను తీసుకువచ్చారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఉదయం 11.34 నిమిషాలకు ముఖ నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తంలో కల్యాణం వైభవంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పుస్తె, మట్టెలు, పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.

హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సీఎస్..

కల్యాణ మహోత్సవానికి నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలి వచ్చారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంత్‌రావు, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, కార్పొరేటర్ సరళ, ఈఓ అంజనీదేవి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఎల్లమ్మ కల్యాణం వేళ.. బల్కంపేట పుర వీధులు పసుపుమయంగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తజనులు అమ్మవారి కల్యాణాన్ని కనులారా తిలకించి పునీతులయ్యారు. ఎల్లమ్మ కీర్తనలకు యువత నృత్యాలు చేస్తూ మైమరిచిపోయారు.

ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలోనూ..

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని 30 ఏళ్లకు పైగా రాష్ట్ర దేవాదాయ శాఖ నిర్వహిస్తూ వస్తోంది. అయితే.. ఒగ్గు కళాకారులు కూడా తమ సంప్రదాయాన్ని వీడలేదు. కరువు కాటకాలు తొలగి పోవాలని, వ్యాధులు దూరం కావాలని అమ్మవారికి కల్యాణం జరిపిస్తారు. ఇదే రోజున దేవస్థానం ఆవరణలో అమ్మవారి కల్యాణ వేడుకను నిర్వహిస్తూ వస్తున్నారు.

నేడు 'గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్'

గచ్చిబౌలి: కేన్సర్ అవేర్‌నెస్‌లో భాగంగా 130కి పైగా దేశాల నుంచి లక్ష మంది ప్రజలు పాల్గొనే ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్– 2024 ఏడో ఎడిషన్‌ను బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, క్యాంబియంట్ డెవలపర్స్ ఆధ్వర్యంలో నేటి మధ్యాహ్నం 3 గంటలకు సైబరాబాద్ కమిషనరేట్ వద్ద సీపీ అవినాష్ మహంతి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారు. కార్యక్రమంలో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి పాల్గొంటారు.

హెచ్‌ఎండీఏ భూములకు ఫెన్సింగ్



సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్‌లోని హెచ్‌ఎండీఏ భూములకు అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ఒకవైపు అక్రమ నిర్మాణాల కూల్చివేత పనులను కొనసాగిస్తూనే మరోవైపు 8.5 కిలోమీటర్ల పరిధిలో ఫెన్సింగ్ పనులను ప్రారంభించినట్లు అధికారులు చెప్పారు. సర్వే నంబర్లు 100, 101లలో ఉన్న 445 ఎకరాల హెచ్‌ఎండీఏ భూముల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఇటీవల నిర్మాణాల తొలగింపు చర్యలను చేపట్టిన సంగతి తెలిసిందే. పలువురికి నోటీసులు సైతం అందజేశారు. భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రెంచింగ్ పనులను కూడా చేపట్టినట్లు పేర్కొన్నారు. మరోవైపు వివిధ ప్రాంతాల్లో ఉన్న హెచ్‌ఎండీఏ భూములు అన్యాక్రాంతం కాకుండా అవకాశం ఉన్న అన్ని చోట్ల జియోఫెన్సింగ్ చేయాలని భావిస్తున్నారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించడంతో పాటు ఫెన్సింగ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని మందు (విషం) సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటన పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామానికి చెందిన క్రాంతికుమార్(38) ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన యువకుడు రెండు రోజుల క్రితం బలవన్మరణానికి యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నగరంలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధుడిని ఢీకొట్టిన బైక్

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: వాకింగ్ చేస్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టిన ఘటనలో తీవ్రగాయాల పాలై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడకు చెందిన అమియా కుమార్‌దాస్(66) సోమవారం సాయంత్రం 7 గంటలకు రోడ్డు సమీపంలో వాకింగ్ చేస్తున్నాడు. బోంగ్లూర్ నుంచి మన్నెగూడ వైపు వెళ్తున్న బైక్ వృద్ధుడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతని తలకు, చేయి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత నిమిత్తం పక్కనే ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి 11.30 గంటలకు దాస్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డెంగీతో బాలుడు మృతి



ఆస్పత్రి ఆవరణలో ఆందోళన వ్యక్తంచేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

'పట్నం' ఆస్పత్రిలో ఘటన
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల ఆందోళన
- నాలుగు రోజులుగా డెంగీ చికిత్స పొందిన మునీశ్వర్



మునీశ్వర్ (ఫైల్)

చేవెళ్ల: డెంగీ బారిన పడిన తమ బిడ్డ వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఇందుకు యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని చనువెల్లికి చెందిన కుర్వ శ్రీనివాస్, సంతోష దంపతులకు మునీశ్వర్(11), వర్షిత్ ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో పట్నం ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. వైద్య పరీక్షల అనంతరం డెంగీ జ్వరంగా నిర్ధారించిన వైద్యులు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందించారు. సోమవారం సాయంత్రం వచ్చిన వైద్యులు ఇద్దరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని, మంగళవారం డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. సోమవారం రాత్రి రెండు ఇంజక్షన్లు ఇచ్చిన తర్వాత పడుకున్న మునీశ్వర్ ఉదయం వరకూ లేవలేదు. నిద్రలో ఫిట్స్ రావడం, వాంతులు కావడంతో ఊపిరితిత్తుల్లోకి నీరు చేరి బాలుడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఇది విన్న బాధిత కుటుంబ సభ్యులు ఇంజెక్షన్లు వికటించడం వలనే తమ కుమారుడు మృతి చెందాడని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఆస్పత్రి చైర్మన్ పట్నం మహేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి రూ.6 లక్షలు ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.

వైద్యుల నిర్లక్ష్యం లేదు

బాలుడు మృతి చెందడంలో వైద్యుల నిర్లక్ష్యం ఎక్కడా లేదు. డెంగీ ఫీవర్‌తో వచ్చిన ఇద్దరు బాలురకు ఒకే రకమైన ట్రీట్‌మెంట్ అందించాం. మూడు రోజుల పాటు అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, వైద్యం అందించాం. నిద్రలోనే బాలుడికి ఫిట్స్ రావడంతో పరిస్థితి విషమించింది. డెంగీ ఫీవర్‌కు అన్ని ఆస్పత్రిలో అందించినట్లుగానే వైద్యం చేశాం. వైరస్ పరిస్థితిని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. బాలుడి మృతి చెందిన బాధలో కుటుంబ సభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. అంతేకాని ఇందులో ఆస్పత్రి నిర్లక్ష్యం లేదు.

– రామకృష్ణారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- పెట్టుబడి సాయం, రుణమాఫీని వెంటనే చేయాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి

షాద్‌నగర్: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని, సబ్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలు, రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ ఆనంద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్యలు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను.. అధికారం చేపట్టాక నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు అవుతున్నా రైతుభరోసా డబ్బులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతురుణమాఫీ చేస్తామని, కౌలు రైతులకు రైతుభరోసా, సమగ్ర పంటల బీమా పథకాలను అమలు చేస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. కమిటీలంటూ గడువు పెంచుకుంటూ పోతుందని విమర్శించారు. హామీలను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు రామకృష్ణ, హరిభూషణ్ పటేల్, కాసోజు శివకుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, రుషికేష్, వంశీకృష్ణ, సందీప్, కిరణ్‌గౌడ్, ఇస్నాతి శ్రీనివాస్, మల్చలం మురళీ, వెంకటేష్, బాల్‌రెడ్డి ఉన్నారు.

అందని సాగు సాయం

మొయినాబాద్: రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు భారతీయ జనత కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులకు అనేక హామీలు ఇచ్చిందని.. అధికారం చేపట్టి ఏడు నెలలు అయినా వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. సీజన్ మొదలై నెల రోజులు దాటినా రైతుభరోసా ఇవ్వలేదని, రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. ఇచ్చిన మాట నిలుపుకోవాలని, లేని పక్షంలో మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రాజు, మల్లారెడ్డి, వెంకటేశ్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మధు, శేఖర్ యాదవ్, జైపాల్‌రెడ్డి, మేన్‌రెడ్డి, శివ, శ్రీనాథ్ యాదవ్, సంజీవరెడ్డి, సుధీర్‌యాదవ్, మధు గౌడ్, విజయ్‌రెడ్డి, బిక్షపతి, శ్రీనివాస్ ఉన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కాంతారెడ్డి

షాబాద్: మైనర్లు వాహనాలు నడిపినా, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ కాంతారెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని నాగర్‌గూడ గ్రామంలో ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా, రాంగ్ రూట్లో వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్‌ను ఎత్తవద్దని, ఎత్తినా ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని చెప్పారు. మెసేజ్, లింకులను తెరవవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడినట్లు గ్రహిస్తే వెంటనే 1930, ఆపద సమయంలో 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ ఈదుల నర్సింహులుగౌడ్, నాయకులు బాల్‌రాజ్, శ్రీకాంత్‌రెడ్డి, యువకులు తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన దేవరగుట్ట నందీశ్వర ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో దేవరగుట్టపై శిథిలావస్థలో ఉన్న నందీశ్వర ఆలయాన్ని పునర్నిర్మించడానికి అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఆలయాల పునర్నిర్మాణానికి ప్రభుత్వపరంగా సాయం అందజేస్తామని, నందీశ్వర గుడి నిర్మాణానికి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దారెడ్డి అంజన్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఈశ్వర్, ప్రభాకర్, శ్రీదర్, లాలయ్య, విజేందర్‌రెడ్డి, గణేశ్, వెంకటయ్య, శ్రీరాములు, వెంకటేశ్, జంగయ్య, బాబు, పత్యానాయక్, లక్ష్మయ్య, నర్సింహ, చంద్రమౌళి, శ్రీశైలం, మల్లేశ్, అంజయ్య, శ్రీకాంత్, నరేశ్ తదితరులు ఉన్నారు.

హుడా బడి మాస్టారు బదిలీ



బదిలీ ఉత్తర్వులు అందుకున్న మల్లేష్

శంషాబాద్: అవార్డుల పాఠశాలగా గుర్తింపు పొందిన హుడాకాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేష్ బదిలీ అయ్యారు. గత ఎనిమిదేళ్లుగా టీచర్‌గా పని చేస్తున్న ఆయన పాఠశాలను హరితమయంగా తీర్చిదిద్ది హరిత పాఠశాల అవార్డును సాధించడంతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులను సైతం అందుకున్నారు. దాతల సహకారంతో ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దడంతో హుడా బడి ప్రత్యేక గుర్తింపు పొందిది. ఆయన షాబాద్ మండలం, ఎలిగొండ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అ య్యారు. మంగళవారం ఎంఎస్ఓ మధుకర్ ఆయనకు బదిలీ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సహచర ఉపాధ్యాయులు దత్తంరెడ్డి, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు శాలువాలతో సన్మానించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వనిత బంధువులతో కలిసి ఆదివారం తిరుపతికి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని ఇరుగు పొరుగు వారు గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా తెరిచి ఉంది. ఇదే విషయాన్ని వనితకు, పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్.. ఇంటిని పరిశీలించారు. దొంగతనం జరిగిందని అనుమానించారు. అనంతరం ఇంటి యాజమాని వనితను ఫోన్‌లో సంప్రదించగా.. బీరువాలో 4 తులాల మేర బంగారం, కొంత నగదు ఉందని తెలిపింది. దీంతో పోలీసులు శంషాబాద్ నుంచి క్లూస్‌టీంను రప్పించారు. ఇంటి పరిసరాలను పరిశీలించి, వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి నగదు, నగలు అపహరించారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి ఎలిమినేడు గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎలిమినేడు గ్రామానికి చెందిన మంద సురేష్ ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 4న మల్కాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇది గమనించిన దుండగులు తాళం పగలగొట్టి బీరువాలోని 11 తులాల బంగారు నగలు, 1.50 లక్షల నగదును అపహరించారు. ఈ క్రమంలో మంగళవారం సురేష్ ఇంటికి వచ్చి చూడగా.. చోరీ జరిగిందని గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ, క్రైం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని, త్వరలో దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థి సమస్యల పరిష్కారమే ధ్యేయం

శంషాబాద్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏబీవీపీ నిరంతర పోరాటం చేస్తోందని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రావుల కృష్ణ అన్నారు. మంగళవారం ఏబీవీపీ 75 జాతీయ విద్యార్థి దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక వైఎన్నార్ గార్డెన్‌లో నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఏబీవీపీ పోరాడుతూనే ఉందన్నారు. విద్యార్థులకు ఏబీవీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. జాతి పునర్‌నిర్మాణంలో ఏబీవీపీ పాత్ర కీలకమన్నారు. ఏబీవీపీ నాయకులు సాయిబాబా, చాకలి మహేష్, మణికంఠ, తిరుపతి, విజయ్, చందు, పవన్,చరణ్, శరవణ, శ్యామ్ పాల్గొన్నారు.

నాటడమే కాదు.. సంరక్షణ ముఖ్యం



గునుగల్ అటవీ ప్రాంతంలో మొక్కల గురించి అవగాహన కల్పిస్తున్న రేంజ్ అధికారి

అటవీశాఖ పట్నం డివిజన్ రేంజ్ అధికారి విష్ణువర్ధన్‌రావు

యాచారం: మొక్కలు నాటడమే కాదు.. అవి ఎదిగే వరకు సంరక్షించాలి అని అటవీ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ రేంజ్ అధికారి విష్ణువర్ధన్‌రావు అన్నారు. గునుగల్ అటవీ శాఖ క్షేత్రంలో మంగళవారం పట్నం డివిజన్ పరిధి యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల ఎంపీడీఓలు, ఈజీఎస్ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలు నాటే విషయంలో అవగాహన లోపించి 20 శాతానికి పైగా అవి చనిపోతున్నాయని తెలిపారు. మొక్కలను దగ్గర, దగ్గర నాటితే పెద్దయ్యాక కొమ్మల విస్తరణ కష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. మొక్కమొక్కకు కనీసం రెండు మీటర్ల దూరం ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. గునుగల్, ఆగాపల్లి అటవీ శాఖ పరిధిలో వేలాది మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఇతర మండలాల ఎంపీడీఓలు, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

పనికి కుదిరి... పక్కాగా స్కెచ్‌వేసి

- ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ విజయ్‌కుమార్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న డీఐ రాంరెడ్డి

షాద్‌నగర రూరల్: ఉపాధి కోసమని నేపాల్ నుంచి వలస వచ్చిన ముఠా.. ఇళ్లలో పని చేస్తామంటూ అడుగుతారు. పనికి కుదిరిన చోట నమ్మకంగా ఉంటూ.. యాజమాని ఇంట్లో లేని సమయంలో చోరీకి పాల్పడతారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన ప్రసన్న బదువాల్, భర్త ప్రశాంత్ బదువాల్‌లు పట్టణానికి వలస వచ్చారు. స్థానిక అయ్యప్ప కాలనీకి చెందిన గదం రమేష్ ఇంట్లో పాచిపని చేసేందుకు ప్రసన్న ఒప్పందం కుదుర్చుకుంది. నమ్మకంగా ఉన్నట్టు నమ్మించింది. ఈ నేపథ్యంలో ఇంటి యాజమాని రమేష్ గత నెల 30న కుటుంబ సభ్యులతో కలిసి కర్నూల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన ప్రసన్న.. భర్త ప్రశాంత్ బదువాల్ చోరీకు ప్లాన్ చేశారు. ఈ ముఠాలోని మిగతా సభ్యులైన కృష్ణ పశుపతి, భీంసాయి, ఆకాష్‌లకు సమాచారం ఇచ్చారు. అదే రోజు ఉదయం సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. తాళాలు పగలకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని 9తులాల బంగారు ఆభరణాలు, రెండు లక్షల నగదును అపహరించారు. సీసీకెమరాలు, హార్డ్‌డిస్క్‌లను తీసుకెళ్లారు. అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చిన రమేష్‌కు ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటం, బీరువా తెరిచి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించాడు. పోలీసులను ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు.

నేపాల్‌కు పరార్..

ఇంట్లో పనికి కుదిరిన ప్రసన్నను పోలీసులు అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారించగా చోరీ ముఠా గుట్టు రట్టయింది. ఈ ముఠా పట్టణంలోని అయ్యప్ప కాలనీతో పాటు సాంబశివ కాలనీలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకుంది. మిగతా సభ్యులు నేపాల్‌కు పారిపోయారని ఆమె తెలిపింది. ప్రసన్న దంపతుల నుంచి 13.5 తులాల బంగారం, రూ.25వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. శంషాబాద్ డీసీపీ రాజేష్ పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ రాజ్‌కుమార్, సైబరాబాద్ క్రైం డీసీపీ నరసింహ, అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, నేతృత్వంలో కేసును చేధించారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సిబ్బంది మోహన్, కరుణాకర్, యాదగిరి, జాకీర్, రాజు, రఫీలను ఉన్నతాధికారులు అభినందించారు.